సాక్షి
విజయనగరం

ఆదివారం । 5 । మే । 2024



ఆర్‌బీకేలు... రైతు నేస్తాలు

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఆర్‌బీకేలు రైతు నేస్తాలుగా మారాయి. విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు సేవలందిస్తున్నాయి. - 8లో



గంగన్నపాడులో అగ్ని ప్రమాదం

తెర్లాం మండలంలోని గంగన్నపాడులో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు పశువుల శాలలు దగ్ధమయ్యాయి. ఓ ఆవు మృతి చెందింది. - 8లో



వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు

సార్వత్రిక ఎన్నికల సమరం దగ్గరపడుతున్న వేళ అధికార వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు ఊపందుకుంది. - 8లో

న్యూస్‌రీల్

శతశాతం ఓటింగ్ లక్ష్యం

- ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్



ప్రతిజ్ఞ చేయిస్తున్న ట్రైనీ సహాయ కలెక్టర్ బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్

విజయనగరం అర్బన్: జిల్లాలో శతశాతం ఓటింగ్ సాధించాలన్నదే ఎన్నికల కమిషన్ లక్ష్యమని ట్రైనీ సహాయ కలెక్టర్ బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్ చెప్పారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. పోలింగ్ సమయాన్ని గంటపాటు పెంచినట్టు తెలిపారు. స్వీప్‌లో భాగంగా నగరంలోని రాజీవ్ స్టేడియం నుంచి మహాత్మాగాంధీ విగ్రహం వరకు శనివారం నిర్వహించిన రెండు కిలోమీటర్ల పరుగును ఆయన ప్రారంభించి పాల్గొన్నారు. రాజీవ్ స్టేడియం వద్ద ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో 85 ఏళ్ల వయస్సు నిండిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దే తమ ఓటు హక్కు విని యోగించుకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నామని, మే 7 నుంచి 10వ తేదీ వరకు హోం ఓటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న వారు ఓటు వేయడంపై దృష్టి సారించాలన్నారు. పరుగులో పాల్గొన్న వారితో ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: గవర్న్‌మెంట్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్ (స్కాలర్‌షిప్ సెక్షన్)నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 – 25 విద్యా సంవత్సరానికి విదేశాలలో పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ ప్రోగ్రాంకు ఎస్టీ అభ్యర్థులు 20 మందిని ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీ ఓవర్సీస్.ట్రైబల్.గవ్.ఇన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారిని సంప్రదించాలని సూచించారు.

లోకం ముందే భూముల దందా!

కొండలు, వాగులు, వంకలు.. నిరుపేదల డీ పట్టా భూములు.. ఇలా ఏవైనా సరే.. తన కన్నుపడితే.. గుప్పిట్లోకి చేరిపోవాల్సిందే. ఎదురు తిరిగే రైతుల పిల్లలకు తన కంపెనీలో ఉద్యోగాలు కల్పిస్తామని బిస్కెట్ విసురుతుంది. ఆ లోపు ఆక్రమణల చుట్టూ ప్రహరీ కట్టించేస్తుంది. అటువైపు కన్నెత్తి చూడకుండా చేస్తుంది. ఆమె భూ సామ్రాజ్యం పక్కనే భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చకచకా సాగుతుండడంతో భూ దాహం మరింత పెరిగింది. తన లక్ష్యం సాధించాలంటే 'అధికారం' అవసరమని గ్రహించింది. రూ.కోట్లు ఖర్చు చేసి టికెట్‌ను సొంతం చేసుకున్న ఆమె.. ఇప్పుడు ఎలాగైనా విజయాన్ని అందుకోవాలని తహతహలాడుతోంది. దీనికోసం రూ.కోట్లు కుమ్మరిస్తున్నట్టు సమాచారం. ఆమె నైజం తెలిసిన బాధిత రైతులు ఊరూరా ప్రచారం చేస్తున్నారు. అమ్మోడుపోయారో.. మీ పని అయిపోతుందంటూ హెచ్చరిస్తున్నారు.

- రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములు స్వాహా
- వాగులు, గెడ్డలు ఆమె గుప్పెట్లోనే...
- అటువైపు రైతులను రానీయకుండా అడ్డుగా గోడలు
- భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణంతో ఆమెలో పెరిగిన భూ దాహం!
- రూ.కోట్లు కుమ్మరించైనా అధికారం పొందాలన్న ఆరాటం
- ఆమె నైజం తెలిసిన రైతులు ఊరూరా ప్రచారం
- ఆక్రమణలను ఇప్పటికే గుర్తించిన రెవెన్యూ అధికారులు



ప్రభుత్వ భూమిలో మిరాకిల్ సంస్థ వేసిన రోడ్డు

పూసపాటిరేగ:

భూ ఆక్రమణలు, దందాలతో రూ.వందల కోట్లు సంపాదించడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. 'లోకం' అంతా చూస్తుండగానే రైతుల వద్ద కారుచౌకగా భూములు కొట్టేశారు. అందులోని వాగులు, కొండలు, గుట్టలను కలిపేసుకున్నారు. ఆమె భూములకు ఆవలవైపు ఉండే వ్యవసాయ భూములకు రైతులు వెళ్లకుండా ప్రహరీలు కట్టేశారు. ప్రశ్నించిన రైతులకు.. పిల్లలకు తన సంస్థలో కంప్యూటర్ ఉద్యోగాలు ఇస్తామంటూ నమ్మించి నట్టేట ముంచేశారు. ఇప్పుడు ప్రజాసేవ పేరుతో జనం ముందుకు పరుగులు తీస్తున్న ఆమె తీరును చూసిన రైతులు.. అమ్మో అంటూ అప్రమత్తమయ్యారు. ఆమె అరాచకాలను ఊరూరా చెబుతున్నారు. ప్రస్తుతం ఏ ఊరి రచ్చబండపై కూర్చున్నా.. ఆమె భూ ఆక్రమణలు, రూ.కోట్లు కొల్లగొట్టిన తీరుపైనే చర్చ సాగుతోంది. అధికారం రాక ముందే కబ్జాలకు పాల్పడిన 'లోకం'... అధికారం ఇస్తే ఇంకా ఏమైనా ఉందా అంటూ యువత, విద్యావేత్త లు, వివిధ సామాజిక వర్గాల నేతలు ఆలోచనలో పడ్డారట.

'లోకం'తో జాగ్రత్త!

ఏ పని చేసినా అందులో స్వార్థం ఉంటుందన్నది ఆమెను దగ్గరగా చూసిన వారు చెప్పేమాట. లాభం లేనిదే ఏ పనీ చేయరట. కనీసం మంచినీరు కూడా ఇవ్వరన్నది ఆమె చర్యలతో నష్టపోయిన రైతులు చేసే వ్యాఖ్యలు. మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సంస్థలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రచారం చేయడమే తప్ప ఆచరణ చేయలేదంటూ భోగాపురం ప్రాంత యువత అసహనం వ్యక్తంచేస్తున్నారు. నిరుపేదలకు చెందాల్సిన ప్రభుత్వ డీ పట్టా భూములను సైతం వదలని ఆమె.. లోకం దృష్టిలో మంచి ఎలా అతుందని ప్రశ్నిస్తున్నారు. రాజకీయంలోకి వ్యాపార దోరణితోనే వస్తున్నారని నియోజకవర్గంలోని మేధావులు గట్టిగా చెబుతున్న మాట.

20 ఏళ్ల కిందటే ఆక్రమణలకు శ్రీకారం..

భోగాపురం మండలం ముంజేరు రెవెన్యూ పరిధిలోని భూములను స్థానిక ప్రజాప్రతినిధి కొమ్మూరు అప్పడుదొర సహకారంతో 20 ఏళ్ల కిందటే నెల్లిమర్ల నియోజకవర్గ జనసేన అభ్యర్థి లోకం మాధవి కారుచౌకగా కొనుగోలు చేశారు. రైతుల పిల్లలందరికీ ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మించి భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వాటికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ, డీ పట్టా భూములను ఆక్రమించారు. ఇప్పటికే ఆమె ఆక్రమించిన వాగులు, చెరువులు, గెడ్డలు, ప్రభుత్వ భూములను భోగాపురం తహసీల్దార్ కార్యాలయం అధికారులు సర్వే చేశారు. ఆక్రమణను నిర్ధారించి చర్యలకు ఉపక్రమించారు. గెడ్డలు, వాగులను ఆక్రమించి రోడ్లు వేసినట్టు గుర్తించారు. భోగాపురం గ్రీన్‌ఫీల్డు ఎయిర్‌పోర్టును ఆనుకొని ఉన్న ముంజేరు రెవెన్యూ పరిధి లో 14.22 ఎకరాల ప్రభుత్వ భూమిని మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సంస్థ ఆక్రమణలు చేసినట్టు నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. ఆక్రమించిన భూముల్లో మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టం, మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు రోడ్లు ఉన్నట్టు నివేదికలో పేర్కొన్నారు. ముంజేరు రెవెన్యూ పరిధిలో 293–1లో ఎకరా, 293–5లో 60 సెంట్లు, 296లో 50 సెంట్లు, 337లో 0.61 సెంట్లు, 343లో 3.52 ఎకరాలు, 342లో 5.02 ఎకరాలు, 391లో 1.52 ఎకరాలు, 392లో 1.16 ఎకరాలు, 393లో 29 సెంట్లు మేర ప్రభుత్వ భూమి ఆక్రమణ జరిగినట్టు రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. వీటిపై చర్యలకు ఉపక్రమించడంతో సంస్థ యజమాని కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకోవడం గమనార్హం.

విజయం మనదే..

ప్రచార పర్వం

ఎన్నికల ప్రచారాలతో ఊరూవాడా హోరెత్తుతున్నాయి. విజయమే లక్ష్యంగా అభ్యర్థులు ప్రచారం కొనసాగిస్తున్నారు. చేసిన మేలును మరచిపోవద్దని, మరింత సంక్షేమం అందిస్తామని, ఓటుతో ఆశీర్వదించాలంటూ అభ్యర్థిస్తున్నారు



పెంట గ్రామంలో బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామస్తులందరూ ఊరు పొలిమేరకు వచ్చి ఆయనకు స్వాగతం పలికగా, అభివాదం చేస్తూ ముందుకు సాగారు.



విజయనగరం 39వ డివిజన్‌లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి మహిళలు హారతిచ్చి విజయ తిలకం దిద్దారు. మీ గెలుపు బాధ్యత మాది అంటూ భరోసా ఇచ్చారు.



దత్తిరాజేరు మండలం కె.కృష్ణాపురంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు ఆయనకు అడుగడుగునా మద్దతు తెలిపారు.



వేపాడ మండలం వీలుపర్తిలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అక్కడి నాయకులు, ప్రజలు సాంస్కృతిక ప్రదర్శనలతో ఘనంగా స్వాగతం పలికారు. వందలాది మంది అండగా నిలిచారు.



రాజాంలోని మారేడుబాకలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.



భోగాపురం మండలం ముంజేరులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరోసారి అవకాశం కల్పించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయనకు స్థానిక మహిళలు హారతిచ్చి ఆశీర్వదించారు.

ఫెసిలిటేషన్ కేంద్రాల తనిఖీ

- ఓటింగ్‌కు పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశం
- అన్ని కేంద్రాల్లో హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు

విజయనగరం అర్బన్: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం నియోజకవర్గాల్లో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ సెంటర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి శనివారం తనిఖీ చేశారు. ఓటింగ్ కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఆమె ముందుగా ఎస్.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను సందర్శించారు. ఏర్పాట్లపై ఆర్‌ఓ మురళీకృష్ణను ఆరా తీశారు. పోస్టల్ ఓటింగ్ కోసం పక్కాగా ఏర్పాట్లు చేయాలని, వేగంగా ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజయనగరం జేఎన్‌టీయూ జీవీ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు ఫెసిలిటేషన్ సెంటర్లను సందర్శించారు. హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి, ఓటు వేయడానికి వచ్చే ఉద్యోగులకు అవసరమైన సమాచారాన్ని సహాయ సహకారాలను అందించాలని ఆదేశించారు. ప్రతిచోటా తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర కనీస మౌలిక సదుపాయాలు ఉండాలని సూచించారు. ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎక్కడా ఇబ్బంది పడకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విజయనగరం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ త్రివినాగ్, డీఆర్వో ఎస్.డి.అనిత, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, ఏఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



జేఎన్‌టీయూ జీవీ ప్రాంగణంలోని ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్

జిల్లాలో 18,631 పోస్టల్ బ్యాలెట్లు

- నేటి నుంచి 7వ తేదీ వరకు ఎన్నికల విధుల్లో ఉన్నవారు వినియోగించుకునే అవకాశం
- 8 నుంచి 10వ తేదీ వరకు అత్యవసర సేవల ఉద్యోగులకు...

విజయనగరం అర్బన్: పోస్టల్ బ్యాలెట్ కోసం ఇప్పటికే ఫారం–12 సమర్పించిన ఎన్నికల సిబ్బంది తమ ఓటు హక్కును ఆదివారం నుంచి 7వ తేదీ మధ్య వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గాల వారీగా ఇప్పటికే ప్రకటించిన ఫెసిలిటేషన్ సెంటర్లలో ఓటింగ్ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న పీఓలు, ఏపీఓలు, మైక్రో అబ్జర్వర్లు, పోలీస్, ఆర్టీసీ ఉద్యోగులు, ఇతర జిల్లాల్లో ఓట్లు ఉన్న వారు, ఎసెన్షియల్ సర్వీసులో ఉన్నవారు, అత్యవసర శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు ఓటు వేసుకునే అవకాశం ఉందన్నారు.



ఫెసిలిటేషన్ కేంద్రంలోని పోలింగ్ బూత్‌ల ఏర్పాటు

నియోజకవర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్లు ఇలా...

నియోజకవర్గం	పోస్టల్ బ్యాలెట్లు
బొబ్బిలి	2,105
చీపురుపల్లి	1,405
గజపతినగరం	1,655
నెల్లిమర్ల	1,525
విజయనగరం	3,975
ఎస్.కోట	1,776
రాజాం	1,741

ప్రచారహోరులో భానుడి ప్రతాపం

- డీహైడ్రేషన్‌కు గురై సేదదీరిన కళావతి

పాలకొండ రూరల్: పాలకొండ మండలంలోని ఎల్.ఎల్. పురం గ్రామంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో డీహైడ్రెషన్‌కు గురయ్యారు. ఆ సమయంలో గడ్డివాము వద్ద ఓ టార్పాలిన్ వేసి సేదతీరే క్రమంలో అన్నీ మరిచి చిన్నగా నిద్రలోకి వెళ్లారు. కాసేపు తర్వాత రెట్టించిన ఉత్సాహంతో ప్రచారం సాగించారు.




ప్రచార క్రమంలో సేదదీరుతున్న వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి

సాకారమైన సొంతింటి కల

- జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ చొరవతో పేదలకు సొంటింటి భాగ్యం
- జిల్లాకు 78,127 ఇళ్లు మంజూరు
- అందులో కొత్త కాలనీలు, ఊళ్లు 644
- 97 శాతం ఇళ్లు నిర్మాణం ప్రారంభం
- సొంతంటికి 39,789 కుటుంబాలు

విజయనగరం గంటస్తంభం: ప్రతి కుటుంబానికి సొంతిల్లు ఓ స్వప్నం. పేదలకు ఆ కల నెరవేరితే అంతకంటే సంతోషం ఉండదు. సొంతిల్లు కట్టుకోలేక, స్థలం లేక రోడ్డు పక్కన గుడిసెలు, అద్దె కొంపల్లో ఉండే కుటుంబాలు కోకొల్లలు. అలాంటి కుటుంబాలకు సొంతంటి కల నెరవేరుస్తానని 2019లో జరిగిన ఎన్నికల సమయంలో వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి మాటిచ్చారు. ఆ ప్రకారమే అధికారంలోకి వచ్చిన వెంటనే లక్షలాది మంది పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా అడుగులు వేశారు. ఊళ్లకు ఊళ్లు నిర్మించి ఔరా అనిపించారు. సొంతింటి భాగ్యం కల్పించి పేదల్లో సంతోషం నింపారు.



నియోజక వర్గాలవారీగా మంజూరు చేసిన ఇళ్లు

నియోజకవర్గం	మంజూరు చేసిన ఇళ్ల సంఖ్య
చీపురుపల్లి	7607
బొబ్బిలి	10,959
నెల్లిమర్ల	10,848
గజపతినగరం	13,227
రాజాం	11,098
ఎస్.కోట	8,163
విజయనగరం	16,225

కొత్తగా వెలసిన వైఎస్సార్ జగనన్న కాలనీలు ఇలా..

నియోజకవర్గం	కాలనీల సంఖ్య
చీపురుపల్లి	77
బొబ్బిలి	102
నెల్లిమర్ల	130
గజపతినగరం	139
రాజాం	76
ఎస్. కోట	100
విజయనగరం	20

జిల్లాకు వేలాది ఇళ్లు

ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీని నెరవేర్చడానికి అధికారులను సన్నద్ధం చేశారు. ఇందులో భాగంగా లబ్ధిదారులను గుర్తించి వారికి పక్కా ఇళ్లు మంజూరు చేసే కార్యక్రమం మొదలు పెట్టారు. విభజిత విజయనగరం జిల్లాలో ఏకంగా 78,127 కుటుంబాలకు కొత్త ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో జగనన్న కాలనీల్లో 34,283 ఇళ్లు మంజూరు చేయడం విశేషం. మిగతా 43,844 ఇళ్లు వారి సొంత స్థలాల్లో కట్టుకునేందుకు మంజూరు చేశారు.



75,864 ఇళ్లు ప్రారంభం

ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను లబ్ధిదారులు కూడా సాకారం చేసుకున్నారు. మంజూరైన ఇళ్లలో 75,864 ఇళ్లు ప్రారంభించారు. కేవలం 970 ఇళ్లు మాత్రమే ప్రారంభం కాలేదు. ఇక ప్రారంభించిన ఇళ్లల్లో 39,789 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటిలో కుటుంబాలు గృహ ప్రవేశాలు చేసి ఆనందంగా ఉన్నారు. మరో 2,577 ఇళ్ల నిర్మాణాలు చివరి దశలో ఉండగా మిగతా ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఈ వేసవి చివరి నాటికి ఆ ఇళ్లు పూర్తి కానున్నాయని గృహనిర్మాణశాఖ అధికారులు చెబుతున్నారు.

644 కొత్త కాలనీలు

జిల్లాలో గ్రామాలకు ఆనుకుని ఉన్న స్థలాలను సేకరించి పేదలకోసం పక్కా లే అవుట్లు వేసింది. ఇలా జిల్లాలో 644 కొత్త ఊళ్లు, కాలనీలు వెలశాయి. ఇది నిజంగా ప్రభుత్వ గొప్పతనమే. అందులో విజయనగరం పట్టణానికి ఆనుకొని గుంకలాం వద్ద పట్టణం స్థాయిలో వేలాదిగా ఇళ్ల నిర్మాణం జరుగుతున్న వైఎస్సార్ జగనన్న కాలనీ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది.

మా కష్టాలు తీర్చారు



మాకు సొంత ఇల్లు లేదు. అద్దె ఇంట్లో ఉంటూ ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్నాం. మా గ్రామం గజపతినగరం టౌన్ కలిపి ఉంటాయి. దీంతో అద్దెలు కూడా ఎక్కువే. ఈ సమయంలో మాకు ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80లక్షలు అందించి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో సాయం చేశారు. స్థలం విలువ గజం రూ.12వేలు ఉంటుంది. జగనన్న దయతో ఇంటి కల నెరవేరింది. కుటుంబంతో సంతోషంగా జీవిస్తున్నాం. – బోడసింగి సీత, బోడసింగిపేట, బొండపల్లి మండలం

సంతోషంగా ఉంది



మాకు తల్లిదండ్రులు కట్టుకున్న చిన్న ఇల్లు ఉండేది. పెళ్లయిన తర్వాత అందరం ఒకే ఇంట్లో ఉండేందుకు సరిపోయేది కాదు. అద్దెకు తీసుకుని నివసించేవారు. ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డాం. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన కాలనీలో స్థలం, ఇంటి నిర్మాణానికి నిధులు ఇచ్చింది. పూర్తి చేసి కొత్త ఇంట్లో హాయిగా ఉంటున్నాం. ప్రభుత్వం మేలు మరచిపోలేనిది. – కంది నీరజ, కొండకరకాం, విజయనగరం మండలం

క్లుప్తంగా

మృతుడి ఆచూకీ లభ్యం

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి - నెలివాడ గ్రామాల మధ్య గల రైల్వే పట్టాల నడుమ ఈ నెల 2న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని రైల్వే పోలీసులు గుర్తించి దర్యాప్తు నిర్వహించారు. మృతుడు బొండపల్లి మండలంలోని నెలివాడ గ్రామానికి చెందిన మామిడి అప్పలనాయుడు(30) గా గుర్తించినట్లు రైల్వే హెచ్‌సీ కృష్ణారావు శనివారం తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు చెప్పారు. బంధువులు మృతదేహాన్ని గుర్తించడంతో పంచనామా నిర్వహించి అప్పగించినట్లు తెలిపారు.

మద్యం బాటిళ్ల పట్టివేత



చీపురుపల్లి: పట్టుకున్న మద్యం బాటిళ్లను చూపిస్తున్న ఎస్‌ఐ

చీపురుపల్లి: మండంలోని కర్లాం సమీపంలో 106 మద్యం బాటిళ్లు అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు చెప్పారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో జి.సిగడాం మండలంలోని బాతువ గ్రామానికి చెందిన పైడిరాజు 106 మద్యం బాటిళ్లు రవాణా చేస్తుండగా గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. ఆయనపై కేసు నమోదు చేశామన్నారు.

జామిలో...

జామి: మండల కేంద్రమైన జామి శివార్లలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది తాండ్రంగి గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం బాటిల్స్ పట్టుకెళ్తున్న సమయంలో అతని నుండి మొత్తం 40 మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.6వేలు ఉంటుందని ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి

బొబ్బిలి : పట్టణంలోని యుద్ధ స్థంభం, పాత బొబ్బిలి మధ్య చెరువు గట్టుపై ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నట్టు గుర్తించామని ఎస్‌ఐ చదలవాడ సత్యనారాయణ విలేకర్లకు తెలిపారు. మృతురాలి వయస్సు 45 – 50 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. మృతదేహం పక్కనే చుట్టలు, లైటర్, గ్లూకోజ్, పచ్చడి సీసా ఉన్నాయన్నారు. పసుపు రంగు జాకెట్టు, పువ్వుల చీర ధరించి ఉందన్నారు. మూడు రోజుల క్రితం మృతి చెందినట్టు భావిస్తున్నామని, ఖననం చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

యువకుడి ఆత్మహత్య




మృతుడు వెంకటరమణ(ఫైల్)

బాడంగి: చెడు వ్యసనాలకు బానిసై, అప్పుల పాలైన ఓ యువకుడు జీవితంపై ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి బొబ్బిలి రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. బాడంగి మండలం కోటిపల్లికి చెందిన బోను వెంకటరమణ (21) గుర్తు తెలియని రైలు కింద పడి శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. తల్లిదండ్రులు రమణమ్మ, శంకరరావు సమాచారం మేరకు వెంకటరమణ కొన్నాళ్లుగా రాజమండ్రి దగ్గర చేపల చెరువు వద్ద పని చేసేవాడు. 15 రోజుల కిందట ఇంటికి వచ్చి తిరిగి వెళ్లలేదు. తాగుడు, క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటుపడి అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చే దిక్కు లేక రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్టు హెచ్‌సీ బి.ఈశ్వరరావు తెలిపారు. సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

పశువులశాలల దగ్ధం

- రూ.4లక్షల ఆస్తి నష్టం



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గేదె

లక్కవరపుకోట: మండలంలోని కళ్లేపల్లి గ్రామంలో మడ్డు ఈశ్వరరావు, మడ్డు మంగలకు చెందిన పశువులశాలలు శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు కాలిపోయాయి. రోజులాగే శుక్రవారం రాత్రి పశువులకు మేత వేసి పాకల్లో కట్టి ఇళ్లకు రైతులు వెళ్లిపోయారు. రాత్రి 10 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో పక్కనే ఉన్న పశువుల శాలలు క్షణాల్లో కాలిపోయాయి. ప్రమాదంలో మంగకు చెందిన ఒక గేదె మృతి చెందగా మరొక గేదె తీవ్రంగా కాలిపోయింది. ఈశ్వరరావుకు చెందిన రెండు గేదెలు మృతి చెందగా మరొక గేదె శరీరం పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 4 లక్షల ఆస్తి, ప్రాణ నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. గాయపడిన పశువులకు మల్లివీడు పశువైద్యాధికారి మండల తులసి వైద్యసేవలను అందించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹270

ఆర్‌బీకేలు... రైతు నేస్తాలు

- విత్తు నుంచి ఎరువుల వరకు అందజేత
- 1,56,575 క్వింటాళ్ల విత్తనాల అందజేత
- 54,507 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా
- ఐదేళ్లలో 15.61 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు
- ఇందుకు రైతులకు చెల్లించింది రూ.2990.61 కోట్లు



విజయనగరం మండలం రాకోడు రైతు భరోసా కేంద్రంలో రైతులకు విత్తనాలు అందిస్తున్న సిబ్బంది (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: చంద్రబాబు పాలనలో అన్నదాత అవస్థలు అన్నీఇన్నీ కావు. విత్తనం నుంచి ప్రారంభమయ్యే కష్టాలు పంట దిగుబడులు విక్రయించే వరకు కొనసాగేవి. విత్తనాల కోసం అయితే చాంతాడంత క్యూల్లో నిలబడే పరిస్థితి. ఎరువులు బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేయక తప్పని దుస్థితి. ప్రకృతి విపత్తులు సంభవిస్తే ఇక ఆ రైతు గతి అంతే... పట్టించుకునే పరిస్థితి ఉండేది కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే చంద్రబాబు పాలనలో వ్యవసాయం ఆయన అన్నట్టే.. దండగగా మార్చేశారు. రాష్ట్రంలో జగనన్న నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది. అన్నదాత పరిస్థితి మారింది. రైతు భరోసా పేరిట సాగుకు పెట్టుబడి సాయం నుంచి దిగుబడులు కొనుగోలు వరకూ అన్నీ తానై ప్రభుత్వం బాధ్యత చేపట్టింది. అన్నదాతకు సాగు దండగ కాదు.. పండగ అనేటట్టు మార్చింది. ఇందుకోసం రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనం నుంచి ఎరువుల వరకు పంపిణీ చేయడంతో పాటు దిగుబడుల కొనుగోలు కూడా ప్రభుత్వమే చేపట్టి మద్దతు ధర చెల్లిస్తోంది.

ఆర్‌బీకేలతో బహుళ ప్రయోజనాలు

రైతు భరోసా కేంద్రాలు రాకముందు రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి రైతులు వెళ్లే వారు. అంతేకాకుండా పండించిన ధాన్యాన్ని కూడ విక్రయించుకోవడానికి దూర ప్రాంతంలో ఉన్న మిల్లులు వద్దకు వెళ్లేవారు. రైతు భరోసా కేంద్రాలు వచ్చిన తర్వాత రైతు ముంగిటకే సేవలు అందుతున్నాయి. విత్తనాలు, ఎరువులు గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల వద్దే అందుతున్నాయి. పంట ఉత్పత్తుల కొనుగోలు కూడా రైతు భరోసా కేంద్రాల వద్దే జరుగుతుంది. రైతుల పండించిన ధాన్యాన్ని రైతుల కళ్లాల దగ్గరకు వెళ్లి ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. ఈ-క్రాప్ బుకింగ్, విత్తనాలు రిజిస్ట్రేషన్ ఇలా రైతులకు అవసరమైన అన్ని సేవలు రైతు భరోసా కేంద్రాల్లోనే రైతులకు అందుతున్నాయి. పంట నష్టం జరిగినప్పుడు పంట నష్టం అంచనా వేయడం కూడా రైతు భరోసా కేంద్రం సిబ్బందే చేస్తున్నారు. పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం తదితర సాంకేతిక సహకారం, సూచనలు, సలహాలు అందించేందుకు ప్రభుత్వం ప్రతి రైతు భరోసా కేంద్రానికి ఒక వ్యవసాయ సహాయకులను నియమించింది. వారు రైతులకు నేస్తాలుగా మారిపోయారు. రైతుకు అన్ని విధాలా రైతు భరోసా కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి. జిల్లాలో 510 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి.

ప్రభుత్వమే కొనుగోలు

దళారులు, వ్యాపారుల ప్రమేయం లేకుండా ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. ముఖ్యంగా మిల్లర్ల పాత్ర లేకుండా ప్రభుత్వం రైతులకు మేలు చేసింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసింది. రైతులకు రవాణ, కళాసీ చార్జీలు కూడా ప్రభుత్వమే చెల్లించింది.

2019 నుంచి 2022 వరకు ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు

సంవత్సరం	ధాన్యం మెట్రిక్ టన్నులలో	చెల్లించిన నిధులు
2019-20	4,52,045	రూ. 869.19 కోట్లు
2020-21	4,60,384	రూ. 869.19 కోట్లు
2021-22	3,06,713	రూ. 595.01 కోట్లు
2022-23	3,41,880	రూ. 697.25 కోట్లు

వైఎస్సార్ రైతు భరోసా నిధుల వివరాలు

సంవత్సరం	రైతులు	వెచ్చించిన నిధులు
2019-20	2,03,451	రూ.276.65 కోట్లు
2020-21	2,39,363	రూ.323.14 కోట్లు
2021-22	2,46,438	రూ.332.69 కోట్లు
2022-23	2,51,659	రూ.343.55 కోట్లు
2023-24	2,63, 394	రూ.302.57 కోట్లు

కష్టాలు తొలిగాయి...



రైతు భరోసా కేంద్రాలు లేనప్పుడు విజయనగరం వెళ్లి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకునే వారం. ఇప్పుడు ఆ కష్టాలు తప్పాయి. మా గ్రామంలోనే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నారు. నాకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. నేను పండించిన ధాన్యాన్ని కూడా రైతు భరోసా కేంద్రం వద్ద కొనుగోలు చేశారు. ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో డబ్బులు జమ చేశారు.

– పొటుపురెడ్డి వెంకటరావు, రైతు, మధుపాడ, గంట్యాడ



విజయనగరం మండలం పినవేమలి గ్రామంలో రైతుల కళ్లం వద్ద ధాన్యం కొనుగోలు చేస్తున్న ఆర్‌బీకే సిబ్బంది (ఫైల్)

ఏటా రైతు భరోసా..



ఏటా సమయానికి రైతు భరోసా డబ్బులు నా బ్యాంకు ఖాతాలో జమవుతున్నాయి. రైతు భరోసా కేంద్రం ద్వారా ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్నారు. దీని వల్ల పంట సాగు చేసిన నిజమైన రైతులకు మాత్రమే లబ్ధి కలుగుతుంది. రైతు భరోసా పథకం కింద డబ్బులు ఇవ్వడం వల్ల విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకుంటున్నాను. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం వడ్డీకి అప్పు తెచ్చుకునేవారం. ఇప్పుడు ఆ పరిస్థితి తప్పింది.

– ఎంసత్యనారాయణ, రైతు, పినవేమలి, విజయనగరం

పంపిణీ చేసిన ఎరువుల వివరాలు...

సంవత్సరం	మెట్రిక్ టన్నులలో..
2021-22	25,705
2022-23	22,547
2023-24	6,255

పంపిణీ చేసిన విత్తనాల వివరాలు

సంవత్సరం	విత్తనాలు క్వింటాళ్లలో..
2020-21	34,821
2021-22	37,460
2022-23	41,418
2023-24	42,876

గంగన్నపాడులో అగ్ని ప్రమాదం



గంగన్నపాడులో జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయిన పశువుల శాలలు



గంగన్నపాడులో బాధితులతో మాట్లాడుతున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: మండలంలోని గంగన్నపాడులో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు పశువుల శాలలు దగ్ధం కావడంతో పాటు, ఓ ఆవు మృతి చెందింది. మరొక ఆవు తీవ్రంగా గాయపడింది. శుక్రవారం అర్ధరాత్రి స్థానిక రైతు భరోసా కేంద్రానికి దగ్గరలో ఉన్న కోట సింహాచలం, కోట సత్యం, కోట సరోజిని, కొత్తకోట సత్యనారాయణలకు చెందిన పశువుల శాలలు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. ఈ ప్రమాదంలో కోట సింహాచలంకు చెందిన ఒక ఆవు మృతి చెందగా.. మరొక ఆవు తీవ్రంగా గాయపడింది. పశువుల శాలలు కాలిపోతున్నాయని తెలుసుకున్న సంబంధిత రైతులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాద విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి సిబ్బందిని పంపించి నష్టాన్ని అంచనా వేయించారు.

బాధితులను ఆదుకుంటా...

అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధిత రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని గంగన్నపాడు గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాద విషయం తెలుసుకొని ఎమ్మెల్యే గ్రామానికి వెళ్లి బాధిత రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచ్ కోట సరోజని ఉన్నారు.

అయ్యో 'పాప'ం

- శ్లాబ్ పెచ్చులు పడి పసికందు మృతి



మృతి చెందిన పసికందు వంశిక

పాలకొండ: మూడు నెలల పసికందు..రాత్రంతా తల్లి పక్కన హాయిగా పడుకుంది. తెల్లవారగానే తల్లి ఇంటిపనుల కోసం లేవగా చిన్నారి ఇంకా నిద్రలో ఉంది. అంతలోనే ఇంటి శ్లాబ్ రూపంలో మృత్యువు పసికందును పొట్టన పెట్టుకుంది. తన కళ్ల ముందే శ్లాబ్ పెచ్చుపడి పసికందు మృతి చెంద డంతో తల్లి హృదయం తల్లడిల్లింది. ఈ విషాద ఘటన పాలకొండ మండలంలోని వెలగవాడలో శనివారం జరి గింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కేవటి సంజీవు, మంజుల దంపతులకు మూడు నెలల క్రితం పాప పుట్టింది. ఆ పాపక వంశిక అని నామకరణం చేశారు. సంజీవు హైదరాబాద్‌కు వలస కూలీగా వెళ్లి అక్కడే పనులు చేసుకుంటున్నాడు. పాప చిన్నవయస్సు కావడంతో మంజుల గ్రామంలోనే ఇండి పనులు చూసుకుంటోంది. ఎప్పటిలాగానే శుక్రవారం రాత్రి పసికందును పక్కన వేసుకుని బయట వరండాలో చాపపై పడుకుంది. తెల్లవారడంతో మంజుల లేచి ఇంటిపనుల్లో ఉండగా పసికందు అక్కడే పడుకుంది. ఆ సమయంలో ఇంటి శ్లాబ్ పెచ్చుఊడి తలపై పడడంతో పసికందు అక్కడికక్కడే మరణించింది. ఈ సంఘటనతో తల్లి మంజు ల సొమ్మసిల్లిపడిపోయింది. ఇరుగుపొరుగు వారు వచ్చి సపర్యలు చేసి ఈ సమాచారాన్ని పోలీసులకు తెలియజేశారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.

మద్యం అమ్మకాలపై ప్రత్యేక నిఘా

పార్వతీపురం టౌన్: మద్యం అక్రమ అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టి కేసులు నమోదు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పార్లమెంట్, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పార్వతీపురం మన్యం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో గల 53 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 8 బార్లలో అమ్మకాలను పరిమితులకు లోబడి సీసీటీవీ నిఘాలో పర్యవేక్షిస్తున్నామన్నారు.

ఎన్నికల వేళ వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు



విజయనగరం: వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: సార్వత్రిక ఎన్నికల సమరం దగ్గరపడుతున్న వేళ అధికార వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు ఊపందుకుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పాలన, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైన 10వ డివిజన్ గెడ్డవీధికి చెందిన 100 కుటుంబాలు టీడీపీ, జనసేన పార్టీలకు గుడ్ బై చెప్పి శనివారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారందరికీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్ర స్వామి మీడియాతో మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో పార్లమెంట్ సభ్యులుగా బెల్లన చంద్రశేఖర్‌కు, శాసనసభ్యులుగా తనకు మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన రమణ మాట్లాడుతూ ఈ నెల 13న జరగనున్న ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో కోలగట్లను గెలిపిస్తామని మాట ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీలో 30 కుటుంబాల చేరిక

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామానికి చెందిన 30 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సమక్షంలో శనివారం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పెండ్యాల రామకృష్ణ, సూరినాయుడు, నెట్టి గురునాయుడు, సురేష్, గురు రామోజీ, కోమ్మ సూర్యనారాయణ, కోమ్మ ఆదిబాబు, పెండ్యాల ఎరుకు నాయుడు, సూర్యప్రకాశరావు, కోమ్మ సత్యనారాయణ, నారం నాయుడు, మన్యా రాము, గోండ్యాల రమణమూర్తి, నెట్టి ఆదినారాయణ, షేక్ రహమాన్, మామిడి కనక రావు, కోర్నాన అగ్గిరాముడు, పైడితల్లి, చుక్క శివరాం, గౌరినాయుడు, సత్తిబాబు, కోలుసు చిన్నారావు, పట్నాన రాము, శ్రీను, కోన గంగ, నెట్టి చిన గురునాయుడు, బడిబట్ల అచ్యుతరావు, కోమ్మ రమణమూర్తి, కోమ్మ కృష్ణ, అప్పారావులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశ రావు, పార్టీ జిల్లా నాయకులు ఎం.నారాయణమూర్తి రాజు, పార్టీ మండల అధ్యక్షుడు బోద్దల చిన్నంనాయుడు, సర్పంచ్ తాళ్లపూడి కీర్తి, నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు, కోమ్మ నాగమణి తదితరులు పాల్గొన్నారు.



బొండపల్లి: నెలివాడలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

మేమంతా వైఎస్సార్‌సీపీతోనే ఉంటాం..



బొబ్బిలి: వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తదితరులు

బొబ్బిలి: సంక్షేమానికి చిరునామా అయిన వైఎస్సార్ సీపీతోనే తాముండాలని నిర్ణయించుకున్నట్టు మండలంలోని ముత్తాయవలస గ్రామానికి చెందిన బలగ ఆదిత్య కుమార్ తదితరులు అన్నారు. గ్రామానికి చెందిన దాదాపు 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్వతీపురం పరిశీలకులు తూముల భాస్కరరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఉత్తరావిల్లి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుంపాంలో 20 కుటుంబాలు చేరిక



పూసపాటిరేగ: వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల చేసిన పరిపాలనకు ఆకర్షితులై గుంపాం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు టీడీపీ, జనసేనని వీడి నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సమక్షంలో శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన 20 కుటుంబాలు వారికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పార్టీ నాయకులు ఎడ్ల రామకృష్ణ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధి తాటిశెట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంట గెలవని రాణి..!



ఆమెది ఒంటెత్తు పోకడ వ్యవహారమన్న ఆరోపణలున్నాయి. ఎమ్మెల్సీగా పదవి అనుభవించినా సంతృప్తి లేదు. ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి కావాలన్నదే ఆమె లక్ష్యం. అయితే అందుకోసం అందరినీ కూడగట్టాల్సిన ఆమెకు ఎవరితోనూ పొసగదు. సొంత పార్టీలోని మాజీ ఎమ్మెల్యేతో ఇప్పటికీ విభేదాలే. కూటమి కట్టి పోటీ చేస్తున్నప్పటికీ..కూటమి పార్టీ ఎంపీ అభ్యర్థితోనూ సఖ్యత అంతంతమాత్రమే. నియోజకవర్గంలోని మూడు మండలాల్లోనూ ఆమెను వ్యతిరేకించేవారే ఉన్నారని సొంతపార్టీ నాయకులే చెప్పుకుంటారు. ఆమె ధోరణి, వ్యవహార శైలిపై అసంతృప్తితో ఉన్న నాయకులు, కార్యకర్తలు పలుమార్లు పార్టీ అధిష్టానం వద్ద పంచాయితీ పెట్టిన ఉదంతాలూ ఉన్నాయి. మక్కువ మండలంలోని ఆమె వ్యతిరేక వర్గం..కేవలం కూటమి ఎంపీ అభ్యర్థికి మాత్రమే అనుకూలంగా ప్రచారం చేస్తున్నట్లు సమాచారం. పాచిపెంట మండలంలోనూ పార్టీ కేడర్‌కు గతంలో ఆమెతో విభేదాలున్నాయి. పార్టీలోని సొంత వర్గీయులే కాదు..వ్యతిరేక వర్గం వారైనా తలెగరేస్తే పాతాళానికి తొక్కేసే వరకూ ఆమె నిద్రపోరనే ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. ఆమె వైఖరిని ఖండిస్తూ గతంలో సొంత పార్టీ నేతలే సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం గమనార్హం. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. ఇవన్నీ చాలదన్నట్లు కులవివాదాన్నీ ఎదుర్కొంటున్నారు. ఇలా ఇంటా బయటా వ్యతిరేకతను కూడగట్టుకున్న తెలుగు దేశం పార్టీ సాలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి..ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్తారో అన్న చర్చ సాగుతోంది.

–సాక్షి, పార్వతీపురం మన్యం

సాలూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి ఏమైనా ఉందా అని భూతద్దం పెట్టి వెతికినా కనిపించదు. తనకు ఎమ్మెల్యేగా అవకాశమిస్తే అది చేస్తా..ఇది చేయిస్తా అంటూ టీడీపీ తరఫున ఎన్నికల బరిలో దిగుతున్న గుమ్మిడి సంధ్యారాణి కొద్దిరోజులుగా ఊదరగొడుతున్నారు. కనీసం తాను ఎమ్మెల్సీగా పదవిని అనుభవించిన ఆరేళ్ల కాలంలో ఏం చేశారో చెప్పాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ హయాంలో ఆరేళ్లు ఎమ్మెల్సీగా చేసినా నియోజకవర్గానికి ఆమె చేసింది శూన్యం. తాగునీరు, ఇతర అవసరాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేశామని ఆమె చెబుతుంటే అధికార పార్టీ నేతలు అడిగిన ప్రశ్నలకు తిరిగి సమాధానం ఇవ్వలేకపోతున్నారు. కనీసం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్‌ చేస్తున్నా స్పందించడం లేదు. తెలుగు దేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే ఆమె ఎమ్మెల్సీగా పదవిని అనుభవించారు. పదవిలో ఆమె ఉన్నది ప్రజల శ్రేయస్సు కాద ని, ఆమె స్వలాభం కోసమేనని సొంత పార్టీ నేతలే విమర్శిస్తుంటారు. సాలూరులో ఆటోనగర్‌ను అభివృద్ధి చేస్తామని, లారీ పరిశ్రమను ఆదుకుంటామని స్వయంగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయాంలో హామీ ఇచ్చారు. బైపాస్ రోడ్డును పూర్తి చేస్తామని చెప్పినా చేయలేదు. ఈ ప్రాంత ఎమ్మెల్సీగా వాటి సాధన కోసం ఆమె ఏనాడూ పట్టుబట్టలేదు. టీడీపీ హయాంలో ఏజెన్సీలో గిరిజ నుల మరణాలు అధికంగా సంభవించాయి. ఒక్క కరాసవలసలోనే డెంగీ జ్వరాలతో 10 రోజుల వ్యవధిలో 11 మంది వరకు చనిపోయారు. కొదమ పంచాయతీ గిరిశిఖర సిరివర గ్రామం నుంచి డోలీలో గర్భిణిని తీసుకువస్తే..మార్గమధ్యంలోనే ఆమె ప్రసవించింది. దీంతో మానవహక్కుల సంఘం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది.

ఎన్నికల ముందు హడావుడి

సాలూరులో వంద పడకల ఆస్పత్రికి 2019 ఎన్నికలకు ముందు అప్పటి మంత్రి సుజయ్‌ కృష్ణ రంగారావుతో కలిసి సంధ్యారాణి హడావుడిగా భూమి పూజ చేశారు. తర్వాత పట్టించుకోలేదు. కందులపథం బ్రిడ్జికి కూడా ఎన్నికలకు ముందు కొబ్బరికాయ కొట్టి పనులు చేయకుండా వదిలేశారు. సొంత మండలాన్నే ఆమె ఏనాడూ పట్టించుకున్న పా పాన పోలేదని..ఇంక నియోజకవర్గాన్ని ఏం పట్టించుకుంటారని 'తెలుదేశం పార్టీలోని ఓ వర్గం ప్రశ్నిస్తోంది. తన పదవీ కాలంలో అంటీముట్టనట్లుగానే ఆమె కాలం గడిపేశారని గుర్తుచేస్తున్నారు. ఇప్పు డు తాము కూడా అలాగే ప్రవర్తిస్తామని ఆ పార్టీ నేతలు, క్యాడర్ చర్చించుకుంటున్నట్లు తెలుస్తోంది.



రాజాంలో న్యూ ఆర్టీసీ కాంప్లెక్స్

అభివృద్ధిలో రాజాం

రాజాం.. పారిశ్రామిక, వ్యాపార కేంద్రం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైంది. రోడ్ల విస్తరణ పనులు పక్కన పెడితే కనీసం ప్రయాణికుల రాకపోకలకు వీలుగా కాంప్లెక్స్‌ను సైతం నిర్మించలేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రాజాం నియోజకవర్గం ప్రగతి పట్టాలెక్కింది. రోడ్ల విస్తరణ, సాగు,తాగునీటి సదుపాయాలు, కొత్తగా ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టింది. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి 'నవ రత్నాలను' అందించింది. ఆర్థిక ఆసరా కల్పించింది. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి రాజాంను రారాజుగా నిలిపింది.



- వైఎస్సార్‌సీపీ పాలనలో చకచకా రాజాం అభివృద్ధి
- రూ.1991.21 కోట్ల మేర సంక్షేమ పథకాల లబ్ధి
- దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం
- రాజాం రోడ్డు విస్తరణ, కిమ్మి–రుషింగి వంతెన ప్రారంభం
- కొత్తగా ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం, పార్కు ఏర్పాటు
- వాల్తేరు వద్ద కొత్త వంతెన నిర్మాణం ప్రారంభం
- నియోజకవర్గ కేంద్రంలో అగ్రిల్యాబ్ సేవలు

రాజాం: రాజాం నియోజకవర్గం 2009లో ఏర్పడింది. 2019 సార్వత్రిక ఎన్నికల అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాజాం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించింది. నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషిచేసింది. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని రాజాం ప్రధాన రోడ్డును 80 అడుగుల మేర విస్తరించింది. అన్నిహంగులతో ఆర్టీసీ కాంప్లెక్స్‌ను నిర్మించింది. పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా పార్కును నిర్మించింది. వంగర, సంతకవిటి మండలాల్లో సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించింది. గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా నియోజకవర్గంలోని ప్రజలకు కేవలం 58నెలల పాలనలో వివిధ సంక్షేమ పథకాల కింద రూ.1991.21 కోట్లు అందించింది. పేద, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక సంక్షేమానికి కృషిచేసింది. అందుకే.. ఈ ప్రాంత ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అంటే ఓ నమ్మకం.



నాడు-నేడుతో బాగుచేసిన రేగిడి మండలం వండానపేట పాఠశాల



రాజాంలో కొత్తగా విస్తరించిన రోడ్డు

• చకచకా రోడ్డు విస్తరణ

రాజాం ప్రధాన రహదారిని తొలవిడతలో శ్రీకాకుళం రోడ్డులో హోండా షోరూం నుంచి బొబ్బిలి రోడ్డులోని పైడితల్లి అమ్మవారి ఆలయం వరకూ రూ.10 కోట్ల ఖర్చుతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విస్తరించారు. ఇప్పుడు గాయత్రీకాలనీ నుంచి జీఎంఆర్‌ఐటీ వరకూ రూ.20 కోట్లుతో రెండో విడత పనులు జరుగుతున్నాయి. రాజాం–పాలకొండ మధ్య రూ. 13 కోట్లతో డబల్ రోడ్డు విస్తరణ పూర్తి చేసింది.

• నాడు-నేడు కళకళ..

నాడు-నేడుతో రాజాం నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు కొత్త రూపును సంతరించుకున్నాయి. కొత్త తరగతి గదులు, మైదానాలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, పవర్ పాయింట్ ప్రజంటేషన్ బోధన, ట్యాబ్‌లు వంటి సదుపాయాలు విద్యార్థులకు సమకూరాయి. రూ.62 కోట్ల మేర నిధులు నాడు–నేడు పనులకు ప్రభుత్వం వెచ్చించింది. వైద్యానికి పెద్దపీట వేస్తూ రాజాం పట్టణంలో రూ. 1.60 కోట్లతో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మించింది. రూ.6 కోట్ల అంచనా వ్యయంతో రాజాం ఏరియా ఆస్పత్రి వద్ద అదనపు భవనాల నిర్మాణాన్ని పూర్తిచేసింది.

• అందుబాటులో ఆర్టీసీ కాంప్లెక్స్

రాజాంలో రూ.1.80 కోట్లతో కొత్తగా ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ప్రభుత్వం నిర్మించింది. ప్రయాణికుల కష్టాలు తీర్చింది.

• ఇంటింటికీ కుళాయిలు..

రాజాం నియోజకవర్గంలో జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు చురుగ్గా సాగుతోంది. ఇప్పటికే 70 శాతం మేర పనులు పూర్తయ్యాయి. నాగావళి నది నుంచి ఫిల్టర్ వాటర్‌ను గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. నియోజకవర్గంలోని 205 గ్రామాల్లోని ప్రజలకు తాగునీటిని అందించేందుకు రూ.89.18 కోట్లు కేటాయించింది. వేసవిలో ఒక్కో మండలంలో రూ.5 లక్షలు నిధులు కేటాయించి క్రాస్ ప్రోగ్రాం కింద తాగునీటి ఇబ్బందులు తప్పిస్తున్నారు.



వంగర మండలంలో ఇలా ఇంటింటి కుళాయిలు

రాజాం నియోజకవర్గ ప్రజలకు జూన్ 2019 నుంచి జూన్ 2023 వరకూ వివిధ పథకాల కింద అందిన ఆర్థిక లబ్ధి ఇలా..

పథకం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్సార్ పెన్షన్ కానుక	36,767	16.91
జగనన్న అమ్మ ఒడి	99,149	148.73
వైఎస్సార్ చేయూత	23,712	72.41
వైఎస్సార్ ఆసరా	59,629	94.98
వైఎస్సార్ రైతు భరోసా	45,768	267.35
ఇంటి నిర్మాణానికి(నేరుగా చెల్లింపు)	8,304	149.47
వైఎస్సార్ సున్నావడ్డీ (ఏపీ)	66,598	20.3
వైఎస్సార్ కాపునేస్తం	1094	6.05
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	9,963	7.92
జగనన్న విద్యాదీవెన	28,706	46.19
జగనన్న వసతి దీవెన	26,771	25.25
వైఎస్సార్ నేతన్న నేస్తం	420	1.9
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	470	1.32
వైఎస్సార్ బీమా	612	9.27
వైఎస్సార్ వాహనమిత్ర	5,084	5.1
సున్నా వడ్డీ పంట రుణాలు	21,420	3.95
జగనన్న చేదోడు	2,076	7.58
డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	30,222	60.31
వైఎస్సార్ మత్స్యకార భరోసా	64	0. 02
వైఎస్సార్ లా నేస్తం	320	0.16
జగనన్న విదేశీ విద్యాదీవెన	03	0.80
వైఎస్సార్ యంత్ర సేవ	470	2.69
వైఎస్సార్ పశునష్ట పరిహారం	495	1.46
గడ్డికోత యంత్రాలు	1130	0.25
వైఎస్సార్ పశుబీమా	924	0.25

• పార్కు ఏర్పాటు..



రాజాంలో ఎర్రావాని పార్కు

రాజాం నియోజకవర్గ కేంద్రంలో యర్రవాని చెరువును రూ.1.08 కోట్ల ఖర్చుతో పార్కుగా తీర్చిదిద్దింది. ఇదివరకే ఇక్కడ సారథి రోడ్డులో వైఎస్సార్ పార్కు ఉండేది. ఈ పార్కును కూడా ప్రభుత్వం బాగుచేసింది. రూ. 20 లక్షల ఖర్చుతో పార్కులో జిమ్ ఏర్పాటు చేసింది.

• వంతెనల సమస్యకు చెక్..



సంతకవిటి మండలం వాల్తేరు వద్ద నిర్మాణంలో ఉన్న కొత్త వంతెన

వంగర మండలంలో నాగావళి నదిపై రుషింగి వద్ద వంతెన నిర్మాణం ప్రభుత్వం పూర్తిచేసింది. వంతెన నిర్మాణం 2013 నుంచి అర్థాంతరంగా నిలిచిపోయినా చంద్రబాబునాయుడు కనీసం పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వంతెన నిర్మాణం పూర్తిచేయడంతో మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. సంతకవిటి మండలం వాల్తేరు వద్ద బలసలరేవును ఆనుకుని నాగావళి నదిపై రూ.37 కోట్లతో మరో కొత్త వంతెన నిర్మాణం జరుగుతుంది. ఇక్కడ వంతెన నిర్మిస్తామని 1998లో చంద్రబాబు హామీ ఇచ్చిగాలికి వదిలేశారు. టీడీపీ ప్రభుత్వం సమయంలో 50 గ్రామాల ప్రజలు ఇక్కడ వంతెన కావాలని ఏడాదిన్నర కాలం పాటు నిరాహార దీక్షలు చేసినా కనీసం పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యను పరిష్కరించింది.



లెక్కకు మించిన ఇంటి స్థలాలు..

రాజాం నియోజకవర్గంలో రాజాం మున్సిపాల్టీతో పాటు మండలాల్లో మొత్తం 77 లే అవుట్‌లు ఏర్పడ్డాయి. పేదలకు ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.1.80లక్షల చొప్పున ప్రభుత్వం అందించింది. రూ.5.80 కోట్లతో విద్యుత్ సౌకర్యం, రూ.1.95 కోట్లతో తాగునీరు, రూ. 2.30 కోట్లతో రోడ్డు సౌకర్యాలు కల్పించింది.

• క్షేత్ర స్థాయిలో సేవలు

రాజాం నియోజకవర్గంలో 11 వార్డు సచివాలయాలతో పాటు 75 గ్రామ సచివాలయాలు, 81 రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. రాజాం వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద రూ.1.20 కోట్లతో అగ్రిల్యాబ్ నిర్మించింది. వీటి ద్వారా ప్రజలకు క్షేత్ర స్థాయిలో సేవలు అందుతున్నాయి. వీటి కోసం రూ. 80 కోట్ల మేర అదనపు నిధులు వెచ్చించారు.



రాజాం మండలం అంతకాపల్లిలో గ్రామ సచివాలయ భవన సముదాయం



రాజాం- పాలకొండ రోడ్డు



రాజాం పట్టణంలో అర్బన్ హెల్త్ సెంటర్



రాజాంలో అగ్రిల్యాబ్

పెన్షనర్ల ఇబ్బందులకు చంద్రబాబే కారణం



గరివిడి మండలం కోడూరు సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

• మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి రూరల్ (గరివిడి): మండుటెండల్లో పెన్షన్‌దారులు ఇబ్బందులు పడడానికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబే కారణమని మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. గరివిడి మండలంలోని కోడూరు, కొండలక్ష్మీపురం, తాటిగూడ, గెడ్డపువలస గ్రామాల్లో శనివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టోని వంద శాతం అమలు చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. నాలుగు సంవత్సరాల పది నెలల కాలంలో ప్రతి కుటుంబానికీ మేలు చేశామని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దనే వలంటీర్లతో పింఛన్లు అందించామన్నారు. అయితే వలంటీర్ల వ్యవస్థపై కక్ష కట్టిన చంద్రబాబు అండ్ కో లేనిపోని ఫిర్యాదులతో ఈ నెల పెన్షన్లు ఇంటి వద్ద పంపిణీ చేయలేకపోయామన్నారు. బ్యాంక్ ఖాతాలకు జమ చేయడంతో అవ్వాతాతలు మండుటెండల్లో వెళ్లి నగదు తీసుకోవడానికి ఎంతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పాలన అందించిన జగన్ మోహన్‌రెడ్డిపై టీడీపీ నాయకులు చవకబారు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలంతా గమనించి విజ్ఞతతో వ్యవహరించి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా, బెల్లాన చంద్రశేఖర్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎడ్ల అప్పారావు, ఎలకల అప్పలనాయుడు, లెంక శ్రీరాములు, వైస్ ఎంపీపీ శ్రీరాములనాయుడు, వలిరెడ్డి లక్ష్మణ, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యురాలు కొణిశ ఉమ, ఎడ్ల వెంకటలక్ష్మీరమణమ్మ, ఆయా గ్రామాల నాయకులు గేదెల ఆదినారాయణ, గేదెల శంకరరావు, గవిడి సన్యాసి, మీసాల ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

మా కొద్దు 'బాబూ' ఈ పింఛన్ కష్టాలు..!



తెర్లాం ఎస్‌బీఐలో పెన్షన్ డబ్బుల కోసం ఆరా తీస్తున్న పెన్షన్‌దారులు

- చంద్రబాబుకో దండం
- మమ్మలను కష్టపెట్టారంటూ ఆవేదన
- నాలుగోరోజు తప్పని నిరీక్షణ
- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు

తెర్లాం: ప్రతినెలా ఒకటో తేదీనే వలంటీరు వచ్చి పింఛన్ అందించేవారు.. ఆ మాయదారి చంద్రబాబుకు ఏమయిందో.. మాకు పింఛన్ అందకుండా కష్టాలపాల్జేచేశారంటూ ఓ వృద్ధురాలి శాపనార్థాలు.. చంద్రబాబు పాలనలో కష్టాలు పడ్డాం.. అవే కష్టాలు మాకు ఇప్పుడు మళ్లీ చూపిస్తున్నారంటూ ఓ వితంతువు ఆవేదన.. పింఛన్ ఇంటివద్దనే ఇస్తే కలిగే నష్టం ఏమిటి 'బాబూ' అంటూ ఓ వృద్ధుడి ప్రశ్న... బ్యాంకుల వద్దకు వెళ్లేవారికి పింఛన్‌దారుల పాట్లు కళ్లకు కడుతున్నాయి. వారి గోడు వినిపిస్తోంది. నాలుగోరోజు శనివారం కూడా పింఛన్‌దారులకు అవస్థలు తప్పలేదు. సుమారు 58 నెలలుగా ఇంటివద్దనే చక్కగా పింఛన్ అందేదని, చంద్రబాబు, ఆయన మనుషులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం వల్లే నాలుగు రోజులుగా బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందంటూ వాపోతున్నారు. మళ్లీ సీఎంగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వస్తేనే తమ కష్టాలు ఉండవని అవ్వాతాతలు ఆశాభావం వ్యక్తంచేశారు.

తప్పని నిరీక్షణ



చిత్రంలో పింఛన్ డబ్బుల కోసం వేచి ఉన్నది గజపతినగరం మండలంలోని కె.ఎస్.ఆర్.పురం, లోగిశ, ముచ్చర్ల, తుమికాపల్లి, కెంగువ గ్రామాలకు చెందిన అవ్వాతాతలు. పింఛన్ డబ్బులు తీసుకునేందుకు గజపతినగరం మండలం కొత్తశ్రీరంగరాజపురంలోని యూనియన్ బ్యాంకుకు శనివారం వచ్చారు. గంటల తరబడి నిరీక్షించారు. గతంలో ప్రతినెలా వలంటీరు ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవారని, చంద్రబాబు అండ్ కో ఫిర్యాదుతోనే మాకు ఈ కష్టాలు వచ్చాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మా ఉసురు చంద్రబాబుకు తగులుతుందంటూ శాపనార్థాలు పెట్టారు. – గజపతినగరం



ఈ ఫొటోలో ఉన్న వృద్ధుని పేరు దత్తి రామారావు. ఈయనది తెర్లాం మండలం, రాజయ్యపేట పంచాయతీ పరిధిలోని రామన్న అగ్రహారం గ్రామం. గతకొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వృద్ధాప్య పింఛన్ డబ్బులు బ్యాంక్ ఖాతాలో పడ్డాయో, లేదో తెలుసుకునేందుకు సుమారు 7కి లో మీటర్ల దూరం నుంచి ఆటోలో తెర్లాం ఎస్‌బీఐకి వచ్చారు. మండుటెండలో చేతిలో కర్ర, యూరినల్ సంచితో పెన్షన్ కోసం బ్యాంక్, బీసీ పాయింట్ చుట్టూ తిరిగారు. ఈ వయస్సులో తమకు ఈ పెన్షన్ కష్టాలు ఏంటిరా బాబూ అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లుగా పింఛన్ డబ్బులు వలంటీర్ ఇంటికి తెచ్చి ఇచ్చేవారని, రెండు నెలలుగా తమకు పెన్షన్ కష్టాలు తప్పడంలేదని వాపోయారు.



తెర్లాంలోని బీసీ పాయింట్ వద్ద పెన్షన్ డబ్బుల కోసం వేచిఉన్న లబ్ధిదారులు



తెర్లాం ఎస్‌బీఐ ఆవరణలో చెట్టు కింద కూర్చున్న వృద్ధులు